క్లుప్తంగా

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

వాజేడు : మండల కేంద్రంలోని వెంకటాపురం (కె) తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, పరీక్ష సూపరింటెండెంట్ కేబీ కిరణ్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ 175 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని 11 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

వెంకటాపురం(కె) : మండల కేంద్రానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతం శ్రీకాంత్(24) మూడు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడని తెలిపారు. ఈ విషయంపై శ్రీకాంత్ భార్య రమ్య మందలించడంతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు సేవించాడని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన స్నేహితుడు రవి కుటుంబ సభ్యులకు విషయం తెలిపి అక్కడ నుంచి వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, ఆరుగుంటపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీరామ్‌నగర్ గ్రామానికి చెందిన అల్లి మల్లేశం శనివారం గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేశం ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రహదారిపై పడిన మల్లేశంకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో వెంకటాపురం(కె) అక్కడి నుంచి భద్రాచలం తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన తార్

భూపాలపల్లి అర్బన్: ఆగి ఉన్న లారీని తార్ ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలపాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి మంజూర్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో సన్‌వ్యాలీ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని తార్ ఢీ కొనడంతో వాహనం నుజ్జు నుజ్జయింది. దీంతో కార్‌లో ప్రయాణిస్తున్న రామప్ప కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు శేషు, భార్య మానస, కూతురు అనూషకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు వారిని బయటకు తీసి 108 వాహనంలో సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్ : కారు, బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కమలా పూర్ క్రాస్‌రోడ్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామానికి చెందిన జనార్దన్ భూపాలపల్లి నుంచి తన భార్య కుమారుడితో బైక్‌పై బోర్లగూడెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ క్రాస్‌వద్ద కాటారం నుంచి భూపాలపల్లికి వస్తున్న కారు జనార్దన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ కిందపడగా జనార్దన్ తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జనార్దన్‌ను 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

కరెంటు తీగల కింద భవనాలు నిర్మించొద్దు

- విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్

ఏటూరునాగారం: ఏటూరునాగారం, కన్నాయిగూడెం, కమలాపురం ప్రాంతాల్లోని ప్రజలు కరెంటు తీగల కింద భవనాలు, ఎత్తయిన కట్టడాలను నిర్మించవద్దని విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నిర్మించే ప్రజలు 33 కేవీ లైన్‌కు 2 మీటర్ల దూరంలో, 11 కేవీ లైన్‌కు 1.2 మీటర్ల దూరంలో, ఎల్‌టీలైన్‌కు 1.2 మీటర్ల దూరంలో నిర్మించుకోవాలని సూచించారు. 33 కేవీలైన్ 11 కేవీ లైన్ ఎల్‌టీ లైన్‌కు 3.7 మీటర్ల క్లియరెన్స్‌గా ఉన్న తర్వాతనే భవనాలు నిర్మించుకో వాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరా, ఇతర ఏ సమస్యలైనా అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఏఈ అశోక్ 9440814867, ఏఈ కన్నాయిగూడెం స్వామి 7901678232, ఏఈ కమలాపురం సుబ్బారాం శర్మ 9440814941లకు సంప్రదించాలని తెలిపారు.

కార్యాలయాల్లో కానరాని మరుగుదొడ్లు

- గ్రామ పంచాయతీల్లో కొరవడిన సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు



పాలెం ప్రాజెక్టు క్వార్టర్‌లో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యాలయం

వెంకటాపురం(కె) : మండలంలో 18 గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని 9 జీపీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక ప్రజలు, పంచాయతీ సిబ్బంది, అధికారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు పంచాయతీ కార్యాలయాలను మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల్లో సగం మందికి పైగా మహిళా ప్రతినిధులే ఉంటున్నారు. మండలంలోని సగానికి పైగా మరుగుదొడ్లు లేని పంచాయతీలు ఉండడంతో వారు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.

సొంత భవనాలు లేని 9 జీపీలు

మండలంలో కొత్తగా ఏర్పడిన 9 కొత్త పంచాయతీల్లో సొంత భవనాలు లేక పాఠశాలలు, వేరే ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాయతీ కార్యాకలాపాల నిర్వహణ చేస్తున్నారు. వెంకటాపురం, పాత్రాపురం, వీరభద్రవరం, మొర్రవానిగూడెం, బర్లగూడెం, మరికాల, ఆలుబాక, సూరవీడు, ఎదిర పంచాయతీల్లో మరుగుదొడ్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన బీసీ మర్రిగూడెం, వీఆర్‌కేపురం, రాచపల్లి, నూగూరు, బెస్తగూడెం, ఉప్పేడు వీరాపురం, తిప్పాపురం, బోదాపురం, రామచంద్రాపురం పంచాయతీల్లో మరుగుదొడ్లు, పంచాయతీ భవనాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో పాఠశాలల్లో పంచాయతీ కార్యకలాపాల నిర్వహణ చేస్తున్నారు. దీంతో కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు లేక జీపీ సిబ్బంది, కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన 9 పంచాయతీలకు భవనాలు మంజూరైనప్పటికీ బీసీ మర్రిగూడెం భవనం నిర్మాణం పనులు మొదలు పెట్టారు. మిగిలిన 8 జీపీల్లో పనులు నేటికి ప్రారంభం కాలేదు.

కొత్త భవనాలు మంజూరయ్యాయి



మండలంలోని 18 గ్రామాల్లో 9 పంచాయతీలకు భవనాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన జీపీలకు సొంత భవనాలు లేవు. కొత్త కార్యాలయాల నిర్మాణానికి భవనాలు మంజూరయ్యా యి. పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే ప్రారంబిస్తాం. ప్రభుత్వ భవనాల్లో, పాఠశాలల్లో ఉన్న జీపీ కార్యాలయాల్లో సైతం మరుగుదొడ్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. – రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

అడవి పందుల దాటికి పంట ధ్వంసం

- ఆదుకోవాలని రైతు వేడుకోలు



అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

ములుగు రూరల్: అడవి పందుల దాటికి మొక్కజొన్న పంట ధ్వంసమైన సంఘటన మండలంలోని పొట్లాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత రైతు పాలడుగుల సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సమ్మయ్య తనకున్న ఆరు ఎకరాల భూమిలో వర్షాకాలంలో వరిసాగు చేయగా పంట పొట్టదశలో అడవి పందులు నాశనం చేశాయని తెలిపారు. యాసంగి సాగులో మొక్క జొన్నసాగు చేయగా అడవి పందులు ధ్వంసం చేయడంతో చేను మొత్తం నేల వాలిందని వాపోయాడు. సుమారు ఏడాది సాగులో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లిందని అన్నారు. సాగు చేసిన పంటలను కాపాడుకుందాం అంటే కరెంటు పెడితే పోలీసులు, ఉచ్చులు పెడితే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. అడవిపందుల కారణంగా పంటలు నష్టపోతున్నామని అటవీశాఖ అధికారులకు తెలియపరిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పంట పూర్తిగా నష్టపోయామని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

జర్నలిస్టులు పోరాటానికి సిద్ధం కావాలి

ములుగు: సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ములుగు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పిట్టల మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తగిన సాయం అందించాలని అన్నారు. మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చే పడుతున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండ

- జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



ఎస్‌ఎస్‌తాడ్వాయి : ఆర్థికసాయం అందజేస్తున్న బడే నాగజ్యోతి



ఏటూరునాగారం : ఆర్థికసాయం అందజేస్తున్న బ్లడ్‌డోనర్స్ సభ్యులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శనివారం మండలంలోని కొడిశాలలో ఇటీవల మృతి చెందిన పిడబోయిన లక్ష్మయ్య కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆమె పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాయం నర్సింగారావు, నాయకులు నారాయణ, సుగుణ, కాంతారావు, విజయ, రమేష్, సమ్మక్క, నర్సింగారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని మొద్దులగూడెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడ జగ్గారావు కుటుంబాన్ని బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, విజయ, చందులాల్, రాంచందర్, ఎలేందర్, కొంరయ్య, సంతోష్, కుమార్, నరేష్, మొగిళి, ఉన్నారు.

బ్లడ్ డోనర్స్ ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన పండుగ సునీల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బాధిత కుటుంబానికి ఏటూరునాగారం బ్లడ్‌డోనర్స్ ద్వారా రూ. 47వేల ఆర్థికసాయాన్ని సోదరుడు అనిల్‌కు అందజేసినట్లు బ్లడ్ డోనర్స్ గౌరవ అధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో అందజేశామన్నారు. దాతల సహకారంతో నగదును సేకరించినట్లు తెలిపారు. దాతలకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వహిద్, మున్నా, సులేమాన్, సాయి, రియాజ్, ప్రశాంత్, చాంద్, లాకవత్ పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యంపై ఆందోళనకు గురి కావొద్దు



వెంకటాపురం(ఎం): బాలికలు ఆరోగ్యంపై ఆందోళనకు గురి కావద్దని, పరీక్షల సమయంలో మానసిక ధృఢత్వాన్ని కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు రిషత్ అన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే స్థానిక వైద్యసిబ్బందిని వెంటనే సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ వందన, ఏఎన్‌ఎంలు అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో చెలరేగిన మంటలు



వాజేడు : మండల పరిధిలోని మొరుమూరు గ్రామం సమీపంలో ఎవరో పొలాల్లో మంట పెట్టడంతో అది కాస్తా కార్చిచ్చుగా మారి గ్రామం వైపునకు దూసుకెళ్లింది. మంటలు చెలరేగుతున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు సమాచార ఇవ్వడంతో ఆరుగురు సిబ్బంది గ్రామపంచాయతీ ట్యాంకర్‌లో నీటిని తీసుకుకొచ్చారు. అటవీశాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది బ్లోయర్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామంలోని యువకులు, గ్రామస్తులు మంటలను గ్రామంలోకి రాకుండా చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్, డీటీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని పరిశీలించారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

- కాటారం డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాటారం : అడవుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించి ఎలాంటి హాని కలుగకుండా చూసుకోవాలని కాటారం డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్ తెలిపారు. మండలంలోని గుమ్మళ్లపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో శనివారం గ్రామస్తులకు అడవుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నివారణ, పులి కదలికలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అటవీ చట్టాలు, వన్య ప్రాణాలను వధిస్తే వర్తించే చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. అడవులు విస్తారంగా ఉంటేనే సమయానికి వర్షాలు కురుస్తాయని పర్యావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడవుల్లో మంటలు అంటిస్తే కఠిన చర్యలు తప్పవని, మంటలు వ్యాపించడం గమనిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉచ్చులు, కరెంట్ తీగలు లాంటివి అమర్చి వన్యప్రాణులను వధిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి పూట అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో యామన్‌పల్లి డీఆర్‌ఓ శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌ఓ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం

కాటారం : కాటారం, మహాముత్తారం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి పర్యటించి ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. మహాముత్తారం మండలం బోర్లగూడెంలో మండల అధ్యక్షుడు పక్కల సడ్వలి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ తోటపల్లి ప్రశాంత్, నాయకులు దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

కాటారంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, పలు పాఠశాలల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అంజిరెడ్డి చిన్నమైల్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై సమావేశం



మాట్లాడుతున్న రేంజర్ రవికుమార్

కాళేశ్వరం : మహదేవపూర్ అటవీశాఖ కార్యాలయంలో మహదేవపూర్, పలిమెల, పెగడపల్లి రేంజ్‌ల అధికారులు అటవీ శాఖ సిబ్బందితో వన్యప్రాణుల సంరక్షణపై శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా వేసవి సమీపిస్తుండడంతో నీటివసతి, అగ్ని నిరోధక చర్యలపై సిబ్బందికి వివరించారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మహదేవపూర్, పలిమెల, పెగడపల్లి రేంజ్ అధికారులు రవికుమార్, నాగరాజు, రాజేశ్వరావు, ఇతర డీఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓ లు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

షీ టీంలతో మహిళలకు భద్రత

- ఎస్సై మౌనిక



మాట్లాడుతున్న ఎస్సై మౌనిక

ములుగు: షీ టీంలతో జిల్లాలోని మహిళలు, బాలికలకు భద్రతతో పాటు భరోసా కల్పిస్తున్నట్లు ఎస్సై మౌనిక అన్నారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలోని మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక షీ టీంను ఏర్పాటు చేశామని ఎక్కడైనా వేధింపులు ఎదురైనా వెంటనే జిల్లా షీ టీం నంబర్ 8712670115 లేదా 100కు డయల్ చేసి వివరాలు తెలిపితే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి ఏ విధంగా రక్షణ పొందాలి అంశాలపై వివరించారు.

అదనపు కలెక్టర్‌కు మంత్రి పరామర్శ



రాధాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

రఘునాథపల్లి: మాతృమూర్తిని కోల్పోయిన ములుగు అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ కుటుంబాన్ని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దనసరి సీతక్క పరామర్శించారు. మహేందర్‌జీ తల్లి రాధాబాయి(80) ఈ నెల 14న మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని మహేందర్‌జీ నివాసానికి వెళ్లి అతని తల్లి రాధాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ తండ్రి మాజీ సర్పంచ్ మల్లాజీని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంత్రి వెంట పీఏసీఎస్ ఛైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ, జక్కుల వేణుమాధవ్, మినుముల యాదవ రెడ్డి, బుస్సారి బాను, వెంకట్‌రెడ్డి, వీరేందర్, శ్రీను ఉన్నారు. అయితే అదనపు కలెక్టర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మంత్రి సీతక్కకు అక్కడి స్థానిక పార్టీ నాయకులు రాకపోవడంతో ఇక్కడ కాంగ్రెస్ నాయకులు ఎవరూ లేరా? అని ఆరా తీసింది.

కాటాపూర్‌లో స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లో జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థులకు తోటి విద్యార్థులు విద్య బోధించారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంత కష్టమైనప్పటికీ పాఠ్యాంశాలు విని ఉపాధ్యాయులు చెప్పినట్టుగా వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఏ వృత్తిలోనైనా రాణించాలంటే దానికి ప్రధాన కారకులు ఉపాధ్యాయులే అనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూక్య సక్రునాయక్, ఎండీ అక్బర్ పాషా, జీవన్ లాల్, కోడూరు సమ్మయ్య, పాపారావు, వెంకటేశ్వర్లు శ్యాంసన్, పీడీ విజయ, శ్రీదేవి ఉషం మోహన్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పేషెంట్లను ప్రేమతో ఆదరించాలి



వలస కూలీలలకు హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్న కిషన్

ములుగు రూరల్: హెచ్‌ఐవీ పేషెంట్లను ప్రేమతో ఆదరించాలని వారిపై ఎలాంటి వివక్షత చూపకూడదని వైజీఆర్ కేర్ లింక్ వర్కర్ కిషన్ అన్నారు. అన్నారు. శనివారం మండలంలోని జాకారం సమీపంలోని పత్తి మిల్లుల వద్ద వలస కూలీలకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించి హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నాలుగు రకాలుగా సంక్రమిస్తుందని అన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత సూదులు ఇంజక్షన్ల ద్వారా, పరీక్షించని రక్తమార్పిడి, హెచ్‌ఐవీ గర్భిణీ నుంచి పుట్టబోయే బి డ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. పేషెంట్లకు ఏఆర్‌టీ మందులు జీవితకాలాన్ని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

దామెరకుంటలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాటారం : మండలంలోని దామెరకుంటలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 130 మందికి ఆస్పత్రి వైద్యుడు దీక్షిత్ పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. రోగులకు షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాసాని రఘువీర్, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని రాంనగర్ 11 కేవీ ఫీడర్‌పై మరమ్మతులు, అదేవిధంగా బస్టాండ్ సమీపంలో కొత్తలైన్ వేస్తున్నందున నేడు (ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్‌కాలని, రాంనగర్, ఎల్‌బీనగర్, లక్ష్మీనగర్, బస్టాండ్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.